క్లుప్తంగా

సామాజిక తనిఖీ ప్రజావేదిక



నర్సంపేట రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ కౌసల్యాదేవి మాట్లాడారు. గ్రామాల్లో సిబ్బంది 10 రోజులు తనిఖీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారులు పద్మనాభరెడ్డి, మాధవి, అసిస్టెంట్ మేనేజర్ పుష్పలత, జేక్యూ సీఓ హరీశ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ రామ్మోహన్, ఎంపీఓ ఫాతిమామేరి పాల్గొన్నారు.

మాజీ మంత్రుల కార్లపై దాడి హేయం

నర్సంపేట : ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించి సహాయం చేయడానికి వెళ్లిన బీఆర్‌ఎస్ మాజీ మంత్రుల కార్లపై రాళ్ల దాడి హేయమని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన కోసం అనేక పోరాటాలు నిర్మించిన ఘనత బీఆర్‌ఎస్ సొంతమన్నారు. అనేక త్యాగాలు, పోరాటాలతో సైనికులకు తలపించేలా పార్టీ శ్రేణులు ప్రజాసేవలు ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రతిదాడులకు దిగితే ముఖ్యమంత్రి ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లే వారా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నాయకులపై దాడులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. దాడిని ఖండించారు.

దేవేందర్‌కు డాక్టరేట్



పర్వతగిరి : మండలంలోని కొంకపాకకు కోతుల దేవేందర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ఆయన 'డిజైన్ సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవల్యూషన్ క్యూనోలైన్ డిరైవ్డ్ నావెల్ హెట్రో సైక్లిక్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ న్యూ మెథడ్స్'పై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణంరాజు పర్యవేక్షణలో పరిశోధనా గ్రంథాన్ని పూర్తి చేశాడు. ఈ సందర్భంగా డాక్టరేట్ ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ పేర్కొన్నారు. దేవేందర్ హైదరాబాద్‌లో డెవలప్‌మెంట్ వోసిమమ్ లాబరేటరీ ఆర్గనైజేషన్‌లో సైంటిస్ట్‌గా పని చేస్తున్నారు.

టీఏఎస్ జిల్లా కన్వీనర్‌గా వివేకానంద



వర్ధన్నపేట : తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టీఏఎస్) జిల్లా కన్వీనర్‌గా మండలంలోని బండౌతాపురం గ్రామానికి చెందిన తాటికాయల వివేకానందను నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివేకానంద గతంలో మండల అధ్యక్షుడిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అందించిన సేవలకు గుర్తింపుగా సంఘం బలోపేతం కోసం పదవి కట్టబెట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివేకానంద విలేకరులతో మాట్లాడారు. పదవితో తన బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా..



చెన్నారావుపేట : బీజేపీ మండల అధ్యక్షుడిగా లింగాపురం గ్రామానికి చెందిన దుంకదువ్వ రంజిత్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రంజిత్ విలేకరులతో మంగళవారం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

అనారోగ్యంతో గిరిజన బాలుడి మృతి

వర్ధన్నపేట : అనారోగంతో గిరిజన బాలుడు మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని బావనికుంట తండాలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. తండాకు చెందిన నూనావత్ శ్రీనుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సాత్విక్(7) ఉన్నారు. సాత్విక్ ఇల్లందలో యూకేజీ చదువుతున్నాడు. జాండిస్ వ్యాధి సోకగా మందులు వాడుతున్నాడు. సోమవారం సాత్విక్ పరిస్థితి విషమించడంతో వర్ధన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం వరంగల్ ఎంజీఎంలో చేర్పగా రాత్రి మృతి చెందాడు.

దుక్కిటెద్దు మృతి

నెక్కొండ : మండలంలోని పెద్దకొర్పోలు శివారులోని రేకులతండాకు చెందిన బాదావత్ శ్రీనివాస్ సాకుతున్న దుక్కిటెద్దు మంగళవారం మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు వట్టివాగులో పడి మృతి చెందింది. వరద ఉధృతిలో దుక్కిటెద్దు కొట్టుకుపోతుండగా తండావాసులు రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆర్నెళ్ల క్రితం రూ.60 వేల అప్పు చేసి కొనుగోలు చేసిన దుక్కిటెద్దు మృతి చెందిందంటూ రైతు శ్రీనివాస్ కన్నీరు మున్నీరయ్యాడు.

ఖానాపురం : లోలెవల్ కల్వర్టుపై ప్రవహిస్తున్న వరద నీరు



రాయపర్తి : మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో పెరిగిన నీటిమట్టం



కుదుటపడని జనజీవనం



రాయపర్తి : రామచంద్రుని చెరువు మత్తడికి మట్టి పోయిస్తున్న అధికారులు



దుగ్గొండి : అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, అధికారులు



ఖానాపురం : వేపచెట్టుతండా వద్ద తాత్కాలికంగా మరమ్మతు చేసిన రోడ్డు

● కొనసాగుతున్న సహాయక చర్యలు

నర్సంపేట : జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలకు అతలాకుతలమైన జనజీవనం ఇంకా కుదుటపడలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత మంగళవారం సహాయక చర్యల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. పలు మండలాల్లో తహసీల్దార్లు, వైద్యాధికారులు, పోలీసులు, ఇరిగేషన్, తదితర శాఖల అధికారులు పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అవసరమైన రక్షణ చర్యలు చేపడుతున్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

ఖానాపురం : పాకాల సరస్సు మత్తడి పారుతుండడంతో అశోక్‌నగర్ శివారులోని లోలెవల్ కల్వర్టుపై వరద ఉధృతి కొనసాగింది. వరుసగా కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సు నిండుకుండలా మారి మత్తడి ఉధృతంగా ప్రవహిస్తోంది. నర్సంపేట–కొత్తగూడ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులతోపాటు ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చిలుకమ్మనగర్ ప్రజలు ఖానాపురం నుంచి అయ్యకట్టు రోడ్డు మీదుగా ప్రయాణాలు సాగిస్తున్నారు.

సీఎం ప్రయాణంతో తాత్కాలిక పనులు

సీఎం రేవంత్‌రెడ్డి ప్రయాణంతో ఉండడంతో మండలంలోని 365వ నంబర్ జాతీయ రహదారిపై వేపచెట్టుతండా నుంచి భూపతిపేట శివారు వరకు గతంలో చేపట్టి వదిలేసిన నిర్మాణానికి తాత్కాలికంగా పనులు చేపట్టారు. పలు కారణాలతో సదరు పనులు వదిలేయడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచాయి. కాగా ఈ దారి మీదుగా సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ మంగళవారం రానుండడంతో అధికారులు అప్రమత్తమై తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

మైలారం రిజర్వాయర్‌లో జలకళ

రాయపర్తి : మండలంలోని మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి భారీగా వర్షపు నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. ఈ సందర్భంగా 0.867 టీఎంసీల సామర్థ్యం కలిగిన క్రమంలో రిజర్వాయర్‌లోకి కాల్వల ద్వారా కాకుండా వర్షపు నీరు చేరడంతో మత్స్యకారులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్‌కు తూములను ఏర్పాటు చేసి మైలారం, పరిసర గ్రామాలకు నీరు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పర్వతగిరి : మరమ్మతు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

'రామచంద్రుని' మత్తడికి తాత్కాలిక పనులు

మండల కేంద్రంలోని రామచంద్రుని చెరువు మత్తడికి బుంగపడి నీళ్లు వృథా పోతుండగా ఇరిగేషన్ శాఖ డీఈఈ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. తాత్కాలికంగా మట్టి పోశారు. చెరువులు, కుంటల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరిగినా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఈఈలు నందకిషోర్, బి.బాలదాస్, మల్సూర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం..

దుగ్గొండి : మండల కేంద్రంలోని పలు వీధులు అపరిశుభ్రంగా ఉండడంతో పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌పై ఎంపీడీఓ లెక్కల అరుంధతి అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ విధులు నిర్వర్తించాల్సిన పారిశుద్ధ్య కార్మికులు ఏ చేస్తున్నారని ప్రశ్నించారు. యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. మండలంలో అధికారులతో కలిసి ఆమె పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట : ముళ్లకంపలు తొలగిస్తున్న..

రైతన్నలకు అపార నష్టం

పర్వతగిరి : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని వివిధ గ్రామాల్లో పంటల, ఆస్తి నష్టం వాటిల్లింది. గుగులోతుతండా పంచాయతీ పరిధిలో మొక్కజొన్న చేలు నేలవాలగా, శివతండాలో భానోతు లాల్యకు చెందిన బావి దరులు వరద తాకిడికి కూలిపోయాయి.

విద్యుత్ జంపర్లకు మరమ్మతు

మండలంలోని 33 కేవీ లైన్ వర్టికల్ పాయింట్ జంపర్లకు విద్యుత్ సిబ్బంది మంగళవారం మరమ్మతు చేశారు. వర్షాల కారణంగా 33 కేవీ లైన్ నెక్కొండ రైల్వే ట్రాక్ దగ్గరలోని పోల్‌కు సమీపంలోని వర్టికల్ పాయింట్ జంపర్లు దెబ్బతినగా సిబ్బంది స్పందించారు. సత్వరమే మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించారు.

శ్రమదానం

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ శివారులోని కట్టయ్యపల్లిలో గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి యూత్ సభ్యులు శ్రమదానం చేశారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లకంపలను, పిచ్చిమొక్కలను, చెత్తను తొలగించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు ముత్యం చేరాలు, కాటి హరీశ్, రాజ్‌కుమార్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నిర్మాణ మార్పులపై మంత్రులకు వినతి

నర్సంపేట: బీజేపీ నర్సంపేట నియోజకవర్గ సంస్థాగత నిర్మాణ మార్పులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి స్థానిక నియోజకవర్గ ఇన్‌చార్జ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కంభంపాటి ప్రతాప్ ఆధ్వర్యంలోని బృందం వినతిపత్రం అందజేసింది. తొలుత ప్రతాప్ ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి చంద్రశేఖర్‌జీ, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శృతి, దుగ్యాల ప్రదీప్‌రావు, కాసం వెంకటేశ్వర్లును మంగళవారం కలిసింది. పార్టీ అభివృద్ధి, సభ్యత్వ నమోదు, తదితరాలపై చర్చించారు. కిషన్‌రెడ్డి సంస్థాగత నిర్మాణంపై దిశానిర్దేశం చేశారు.



కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న నాయకులు

నర్సంపేట మీదుగా సీఎం కాన్వాయ్



నర్సంపేట: వరద నష్టాన్ని పరిశీలించేందుకు మహబూబాబాద్‌కు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం తిరిగి నర్సంపేట మీదుగా హైదరాబాద్ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థులకు అభినందన



దుగ్గొండి : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన మండల కేంద్రంలోని స్పార్క్ టెక్నో సూల్ విద్యార్థులు చిన్మయి, అంజనశ్రీ, సహస్ర, సాయిశివ, కార్తికేయలను ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు పాఠశాల ఆవరణలో మంగళవారం అభినందించారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. ఆత్మరక్షణకు కరాటే దోహద పడుతుందని చెప్పారు. కరాటేలో రాణించడానికి బాలురు, బాలికలు తేడా లేదన్నారు. విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పోతరాజు అనిత, పాఠశాల కమిటీ చైర్మన్ రవి, బొటికె సుదర్శన్, కరాటే మాస్టర్లు దుడ్డె నవీన్, సుమన్, దుడ్డె కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఆర్‌ఆర్' తోడ్పాటు



రాయపర్తి : మండలంలోని పేద కుటుంబాలకు ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ, ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తోడ్పాటు అందిస్తున్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందిన మండలంలోని సూర్యతండాకు గ్రామానికి చెందిన మూనావత్ మోతీలాల్ కుటుంబాన్ని మంగళవారం ఆయన ఫోన్ ద్వారా పరామర్శించారు. అలాగే బాధిత కుటుంబానికి బియ్యం, 15 లీటర్ల వంట నూనె ప్రతినిధులతో పంపించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి వల్లాల సుధాకర్, గబ్బెట పెద్ద బాబు, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం సాయం

పర్వతగిరి : మండలంలోని కల్లెడ ఎస్సీ కాలనీకి చెందిన పసుల వెంకటయ్య, చినపాక సారయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు గ్రామ పెద్ద దొమ్మటి కొమురయ్య, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు మంగళవారం 25 కేజీల చొప్పున బియ్యం సాయం చేశారు. తొలుత బాధిత కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

తాళ్ల సునీల్‌కు గద్దర్ అవార్డు



నర్సంపేట : నర్సంపేట డివిజన్‌కు చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యుడు, జిల్లా కోఆర్డినేటర్ తాళ్ల సునీల్‌కు గద్దర్ స్మారక అవార్డు లభించింది. కళాకారుడిగా సునీల్ అందిస్తున్న సేవలకు గాను ఆయనకు 'గిద్దె గళం' ఆధ్వర్యంలో తొర్రూరులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు అవార్డు అందుకున్నారు.

నెల్లుట్ల సుమన్‌కు..



దుగ్గొండి : మండలంలోని తొగర్రాయికి చెందిన ప్రముఖ గాయకుడు, రచయిత నెల్లుట్ల సుమన్‌కు గద్దర్ స్మారక అవార్డు లభించింది. తొర్రూరులో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశీం, గిద్దె రాంనర్సయ్య, దరువు అంజన్న చేతుల మీదుగా సుమన్ అవార్డు అందుకున్నారు.

రూ.825కే విద్యుత్ కనెక్షన్



దుగ్గొండి : విద్యుత్ మీటర్లు లేని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.825లకే విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) రామ్మూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ కనెక్షన్లపై మంగళవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన వారు తెల్ల రేషన్ కార్డు, కులం సర్టిఫికెట్ జతపరుస్తూ విద్యుత్ సిబ్బందికి లేదా సబ్ స్టేషన్లల్లో అధికారులకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. నేటి నుంచి ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకుంటే గృహజ్యోతి పథకం కింద మీటరు బిగించి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన గృహజ్యోతి అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న కవితారెడ్డి

నల్లబెల్లి : కేజీబీవీ, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తామని జేడీ ఫౌండేషన్ కన్వీనర్ పింగిళి కవితారెడ్డి తెలిపారు. తన కుమారుడు సాయిచంద్ర జన్మదిన వేడుకను స్థానిక కేజీబీవీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సాయిచంద్ర కుటుంబీకులు కేక్ కట్ చేశారు. అనంతరం కవితరెడ్డి విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని మేడపల్లి హైస్కూల్ విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవితరెడ్డి నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సునీత, హైస్కూల్ హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఫౌండేషన్ సభ్యుడు పల్లె మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులకు అడ్డుకట్ట



నర్సంపేట రూరల్ : శిబిరంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్

● డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్

నర్సంపేట రూరల్ : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టొచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ తెలిపారు. పట్టణంలోని సర్వాపురం శివారులోని కేజీబీ విద్యాలయలో బానోజీపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థులు శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా ఎస్‌ఓ, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే వైద్యం చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్ చంద్ర, వైద్యుడు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు

దుగ్గొండి : మండల కేంద్రంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించగా 160 మందికి డాక్టర్ కిరణ్‌రాజ్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దోమలు, ఈగలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలని చెప్పారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తామంటూ రోగులు, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ సాంబయ్య, సలోమీ, రహమాన్, చాణక్య, ఏఎన్‌ఎంలు సరస్వతి, సునీత, కోమల, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి : ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ కిరణ్‌రాజ్

ఖానాపురం : మండలంలోని కొత్తూరు, రాగంపేట, చిలుకమ్మతండా, ధర్మరావుపేట గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు అరుణ్‌కుమార్, కల్పన, రాకేశ్, సునీత పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం వైద్యులు మాట్లాడారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వకుండా శుభ్రం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమాల్లో సిబ్బంది దామోదర్‌రెడ్డి, భాస్కర్, రజిత, సుజాత, రమ, సంధ్య, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి రజిత

నల్లబెల్లి : ఆర్యోవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తోందని పంచాయతీ కార్యదర్శి రజిత తెలిపారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండాయిల్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందజేసిన పోషకాహారాన్ని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రజిత మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల సేవలను విస్తృతపరుస్తోందని తెలిపారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందించడంతోపాటు గర్భిణులు, బాలింతలు ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. పోషకాహారం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభిస్తున్న సేవలను చిన్నారులు, గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సీసీ గోలి కొమురయ్య

వర్ధన్నపేట : ఇందిర మహిళ శక్తి కార్యక్రమాలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని డీఆర్‌డీఏ సీసీ గోలి కొమురయ్య కోరారు. మండలంలోని ఉప్పరపల్లిలో గ్రామైక్య సంఘాల వీఓఏలకు మంగళవారం నిర్వహించిన క్లస్టర్ లెవల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పెరటి కోళ్ల, పాడి గేదెలు, మదర్ యూనిట్ (పౌల్ట్రీ ఫామ్), మైక్రో ఎంటర్‌ప్రైజెస్ మహిళ శక్తి క్యాంటిన్ ఏర్పాటుకు అర్హులను గుర్తించాలని చెప్పారు. అర్హులందరికీ సకాలంలో బ్యాంకు స్త్రీనిధి, సీఐఎస్ ద్వారా రుణాలు ఇప్పించి గ్రౌండింగ్ పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల్లో ఈనెల 10లోపు లక్ష్యాలను పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో వీఓ ప్రతినిధులు కట్ల రజిత, దాడి భవానీ, వీడీ సంధ్య, వీఓఏలు తక్కళ్లపెల్లి శోభ, ఆకుల స్రవంతి, రమ్య, కత్తి స్రవంతి, రమ, మమత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను విస్మరించొద్దు

నర్సంపేట : బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను బూచిగా చూపి ప్రజాసమస్యలను విస్మరించడం సరికాదని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో అనుమల రమేశ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి రమేశ్ హాజరై మాట్లాడారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. రుణమాఫీ సైతం అర్హులందరికీ అందలేదన్నారు. గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. రైతులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ప్రభుత్వం గత ప్రభుత్వ వైఫల్యాలను సాకుగా చూపుతూ కాలం వెళ్లదీసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే ప్రజాపోరాటాలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యుడు కొట్టె సదానందం, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు మాషుక్, విద్యార్థి సంఘం మహిళా విభాగం కన్వీనర్ గణిపాక బిందు పాల్గొన్నారు.

'యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిపించండి'

చెన్నారావుపేట : ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా బరిలో నిలిచిన బండి హరీశ్‌ను గెలిపించాలని నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రూపిక శ్రావణ్‌కుమార్ కోరారు. మండలంలోని కోనాపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హరీశ్‌ను ఎమ్మెల్యే మాధవరెడ్డి బలపర్చినట్లు తెలిపారు. నియోజకవర్గ అధ్యక్ష అభ్యర్థిగా తుమ్మలపెల్లి సందీప్‌కు, రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థి చరణ్‌రెడ్డి ఓటేయాలని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కల్లెపు రాజశేఖర్ గౌడ్, నర్సంపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి కిరణ్, నాయకులు సతీశ్‌రెడ్డి, గజ్జి రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు మానుకోవాలి

నర్సంపేట : పట్టణంలోని 111/1/25, తదితర సర్వే నంబర్లలోని భూములపై ఆరోపణలు మానుకోవాలని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షుడు శింగిరికొండ మాధవశంకర్, వంగేటి గోవర్దన్ కోరారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు కోరుతూ వారు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాధవశంకర్, గోవర్దన్ మాట్లాడారు. పట్టణానికి చెందిన కొలువుల చిన్న నర్సయ్య నుంచి భూమి కొనుగోలు చేయగా స్థలం ఖాళీగా ఉందని కొందరు అక్రమ నిర్మాణాలకు తెరలేపారని చెప్పారు. ఆక్రమణదారులు తప్పుడు రికార్డులు సృష్టించి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు.